క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

హాలియా : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం అనుముల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొర్లపాటి సుజాత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ పేర్ల సుమతి పురుషోత్తం అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వివిధ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికతో హాజరుకావాలని కోరారు.

దుబ్బతండాలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ



రన్‌ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని దుబ్బతండాలో విశ్వస పరిచర్య ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో భాగంగా ఉపవాస దీక్షలు ముగియడంతో భక్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ధీరావత్ హన్యానాయక్, పాస్టర్ ధీరావత్ రమాబాయి పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు నివాళి

త్రిపురారం : మండలంలోని బొర్రాయి పాలెం బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రబోయిన శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్ బొర్రాయి పాలెంలో మృతుడు ఎర్రబోయిన శ్రీనివాస్ ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి శ్రీనివాస్‌కు..

నల్లగొండ టూటౌన్: జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఆదివారం ఏచూరి శ్రీనివాస్ 47వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చిత్రపటానికి ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు పుట్టి మురళీమనోహర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రమోద్‌కుమార్, సత్తయ్య, సంపత్‌కుమార్, నవీన్‌రావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చందంపేట: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన ఆదివారం నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఉగ్గ రాములు తనకున్న పశువులను సమీపంలోని వ్యవసాయ పొలాలకు పశుగ్రాసం కోసం తోలుకుని వెళ్లాడు. ఈ క్రమంలో ఆవు మేసుకుంటూ వెళ్లి అప్పటికే తెగి కింద పడిపోయిన విద్యుత్ తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నారు.

సైనిక్ నవోదయ కోచింగ్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ నాగరాజు

మిర్యాలగూడ టౌన్ : నవోదయ ఆరో తరగతి పరీక్ష ఫలితాల్లో సైనిక్ నవోదయ కోచింగ్ సెంటర్ విద్యార్థుల ప్రతిభను కనబర్చారు. జంగం చేతన్, ఎం జస్వంత్, ఎం. రామ్‌చరణ్, కె. హర్ష, సనలను కోచింగ్ సెంటర్ విద్యార్థులు మెరిట్ లిస్టులోనే అడ్మిషన్లు పొందారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులను కోచింగ్ సెంటర్ డైరెక్టర్ లెంకల నాగరాజు యాదవ్ అభినందించారు.

గుండెపోటుతో ప్రైవేట్ టీచర్ మృతి



యాదయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి : గుండెపోటుతో ప్రైవేట్ ఉపాధ్యాయుడు మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన జాకటి యాదయ్య (42) ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుమారుడి సైకిల్‌ను మరమ్మతు చేయించేందుకు సమీప దుకాణం వద్దకు వెళ్లాడు. అక్కడ సైకిల్‌కు మరమ్మతు చేయిస్తుండగా యాదయ్య అకస్మాత్తుగా కుప్పకూలి కిందపడి పోయాడు. స్థానికులు గమనించి అతడిని దేవరకొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



ఎండిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



వేంపాడ్‌లో ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

నిడమనూరు : పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌లు ఆదివారం అన్నారు. మండలంలోని వేంపాడ్‌లో ఎండిన వరి పొలాన్ని వేర్వేరుగా వారు పరిశీలించారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పర్యటన రద్దు కావడంతో వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్నన్ని రోజులు రెండు పంటలకు నీరు ఇచ్చి పంటలు ఎండకుండా చూశారని గుర్తు చేశారు. సాగర్‌లో 506, 507 అడుగుల లెవల్‌లో నీరు ఉన్నా సాగు నీరు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు నీరు ఇవ్వకపోవడంతో పంటలు ఎండి నష్టపోయారని వారిని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలో నిర్వహించే బీఆర్‌ఎస్ నాయకుల, కార్యకర్తల సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నందున పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ జయమ్మ, డీసీసీబీ డైరెక్టర్ అంజయ్య, తాటి సత్యపాల్, కట్టెబోయిన గురవయ్య యాదవ్ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నికల వరకే..

ఎమ్మెల్యే ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌ల సఖ్యత ఎన్నికల వరకే అని తేలిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎవరికి వారు ఉండి పార్టీలో రెండు గ్రూపులుగా నాయకులు, కార్యకర్తలు విడిపోయారు. ఎన్నికల సందర్భంగా ఉప ఎన్నికల్లో గెలిచిన నోముల భగత్‌కే టిక్కెట్ ఇవ్వడంతో ఎంసీ కోటిరెడ్డి తీవ్ర నిరాశ చెందారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాల్సిన పరిస్థితి ఉందని, ఇద్దరు నాయకులు కలిసి ప్రచారం పాల్గొనాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరిని ఆదేశించారు. అప్పటి వరకు భాగానే ఉన్నారు. ఆదివారం నిడమనూరు మండలం వేంపాడులో ఎండిన పంటలను మాజీ సీఎం కేసీఆర్ పరిశీలించాల్సి ఉండగా పర్యటన రద్దు కావడంతో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్‌లు వేర్వేరుగా ఆ పంటలను పరిశీలించడంతో వారిద్దరి మధ్య పాత వైరం పోలేదని తేటతెల్లమైంది.

కాంగ్రెస్ పాలనలో రైతులకు అవస్థలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్ యాదవ్

త్రిపురారం : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు నానా అవస్థలు పడుతున్నారని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నోముల భగత్ యాదవ్ మాట్లాడుతూ.. అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధిచెబుతారన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్‌లో నిర్వహించే సన్నాహక సమావేశానికి గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్ద ఏత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు కామెర్ల జానయ్య, జంగిలి శ్రీనివాస్, ధనావత్ సుశీల్ నాయక్, చింతకాయల యాదయ్య, బోడ్డు చిన్న సాయిలు, ఉల్లెందుల ఎల్లయ్య పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలి

హాలియా : నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని సాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించే బీఆర్‌ఎస్ నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారన్నారు. ఈ సన్నాహక సమావేశానికి నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్య కర్తలు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రైతు సంఘం జిల్లా మహిళా కన్వీనర్‌గా ఊర్మిళ



మిర్యాలగూడ అర్బన్ : తెలంగాణ రైతు సంఘం జిల్లా మహిళా కన్వీనర్‌గా పట్టణానికి చెందిన కంచర్ల ఊర్మిళ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మార్చి 30న నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం మహిళా జిల్లా సదస్సులో ఎన్నుకున్నట్లు ఆదివారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంలో ప్రత్యేక పనిముట్లు, యంత్రాలను గ్రామీణ ప్రాంతాల మహిళలకు అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ చేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై మహిళా రైతులను సమీకరించి రైతు ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఊర్మిళ ఎన్నిక పట్ల తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ నేత యూసుఫ్‌కు పరామర్శ



యూసుఫ్‌ను పరామర్శిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : దామరచర్ల మండలం వాడపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత ఎండీ యూసుఫ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆదివారం ఆయన నివాసానికి బీఆర్‌ఎస్ నేత గుత్తా అమిత్‌రెడ్డి, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్ధార్థలు పరామర్శించారు. అనంతరం యూసుఫ్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. వారి వెంట దామరచర్ల జెడ్పీటీసీ ఆంగోతు లలితా హతిరాం నాయక్, ఎంపీటీసీ కామేపల్లి అనంతలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, సోము సైదిరెడ్డి, వింజం శ్రీధర్, తిరంశెట్టి కోటేశ్వర్‌రావు, ఎండి షోయబ్, లాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్లు పంపిణీ



ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు అందజేస్తున్న సభ్యులు

మిర్యాలగూడ అర్బన్ : జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఆదివారం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. డాక్టర్ నాగు నాయక్, దైద కిరణ్, డాక్టర్ బాలాజీ నాయక్, సోమ శ్రీనివాస్, శోభా రాణి, రజిత, దయాకర్‌రెడి, డాక్టర్ వికాస్‌కుమార్, వెంకన్న ల సహకారం అందించడంతో జనమైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మునీర్ ఆ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోగుల సందీప్, షాహీర్, అఖిల్, చరణ్ తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీశ్రీ పోలిమేర ముత్యాలమ్మ జాతరకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదివారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు నివాస్, వెంకన్న, గోపాల్ తదితరులున్నారు.

నగదు పట్టివేత

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లెక్లైవర్ వద్ద ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ ద్విచక్ర వాహనదారుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.1.55లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదును సీజ్ చేసి జిల్లా ట్రెజరీకి పంపించినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న పాండురంగారెడ్డి

పెద్దవూర : కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన మండలంలోని వెల్మగూడెం గ్రామానికి చెందిన కాటేపల్లి వెంకటయ్యను బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు తనవంతు సాయం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, బుర్రి రాంరెడ్డి, షేక్ ముస్తాఫా, రావుల వెంకటనారాయణ, కూన్‌రెడ్డి సంతోష్‌రెడ్డి, ఇస్రం లింగస్వామి, గజ్జల శివానందరెడ్డి, వంగాల భాస్కర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవే లక్ష్యంగా పనిచేస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

నల్లగొండ టౌన్ : ఖాతాదారుల సేవే లక్ష్యంగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నామని సంఘమిత్ర కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఫౌండర్ సంగం రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన 51వ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘమిత్ర బ్యాంక్ 1035 మంది వాటాదారులతో రూ.133.13 లక్షల వాటా ధనం కలిగి ఉందన్నారు. 2974 మంది డిపాజిట్‌దారులతో రూ.78.29 కోట్ల డిపాజిట్లు సేకరించినట్లు తెలిపారు. మొత్తం వ్యాపారం రూ.136.84 కోట్లకు పైగా ఉందన్నారు. కార్యక్రమంలో సన్నిదానం చక్రపాణి, మహ్మద్ షరీఫ్, పున్న చండికేశ్వర్, కొంగరి భిక్షం, గజ్జల వెంకటేశ్వర్లు, గుండ అంజిరెడ్డి, బండ భిక్షంరెడ్డి, ఎర్రమల్ల లక్ష్మీనర్సు, చెరిపల్లి పద్మ, వీరవెల్లి భవాని, జెల్ల శ్రీశైలం, అద్దంకి లక్ష్మయ్య, మహ్మద్ నజీరోద్దీన్ పాల్గొన్నారు.

గుడి పునర్నిర్మాణానికి సహకరించాలి



నూతనంగా ఎన్నికైన ముత్యాలమ్మ ఆలయ కార్యవర్గ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : స్థానిక ముత్యాలమ్మ గుడి పునర్నిర్మాణానికి ముదిరాజులందరూ సహకరించాలని పలువురు ముదిరాజ్ నేతలు మెరుగు రోశయ్య, బంటు సైదులు, కోల రామస్వామి, బంటు సత్తయ్యలు అన్నారు. ఆదివారం ముత్యాలమ్మ గుడి పునర్నిర్మాణానికి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం ముత్యాలమ్మ గుడి పునర్నిర్మాణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిర్మాణ కమిటీ అధ్యక్షుడిగా కోల సైదులు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా కోల రామస్వామి, కోశాధికారిగా లింగంపల్లి మట్టయ్య, ఉపాధ్యక్షులుగా బంటు సైదులు, గౌరవ సలహాదారులుగా మెరుగు రోశయ్య, బంటు శ్రీనివాస్, బంటు లక్ష్మినారాయణ, ప్రచార కార్యదర్శిగా కోంక వెంకన్న, జాయింట్ సెక్రటరీగా బంటు దుర్గయ్య, బంటు రమేష్, నక్క సుదర్శన్, ఆవుదారపు ఈరయ్య, బంటు శ్రీనివాస్, దుండిగాల ప్రసాద్, కోల లింగయ్య, మురళి, కార్యవర్గ సభ్యులుగా రమేష్, మట్టయ్య, తిరుమలేష్, మెరుగు చైతన్య, రేవంత్‌కుమార్, రవి, శేఖర్, శివ, ఎల్లయ్య, సైదులు, ఎల్లయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కోమటిరెడ్డి వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న వంగూరి రాఖీ

నల్లగొండ టూటౌన్: బీజేపీ ఎమ్మెల్యేలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచేది కోమటిరెడ్డే అని అన్నారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఎవరు కోవర్టుగా మారారో ప్రజలందరికీ తెలుసన్నారు. మునిగిపోయే నావలా ఉన్న కాంగ్రెస్‌లోకి ఒక్క బీజేపీ ఎమ్మెల్యే కూడా పోరని తెలిపారు. ఈ సమావేశంలో బీజేవైఎం నాయకులు భరత్, దుబ్బాక సాయి, నరేష్, గద్దం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని గొల్లగూడలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ లైన్ మరమ్మతు పనులు జరుగుతున్నందున వివిధ కాలనీల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ నవీద్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, గ్రీన్ ల్యాండ్ ఆస్పత్రి ఏరియా, గొల్లగూడ, రామ్‌నగర్, బీటీఎస్, ఆర్టీసీ కాలనీ, క్రాంతినగర్, పద్మావతి కాలనీ, దారుషాష కాలనీల్లో ఉదయం 8:30 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే
- అందుబాటులో లేని వైద్యాధికారి
- వైద్య సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం



దామరచర్ల పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. దామరచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం రోగుల వద్దకు వెళ్లి వైద్యం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి గది వద్దకు వెళ్లగా డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేందుకు పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారని, డాక్టర్లు అందుబాటులో లేకపోతే ఎలా అన్ని ప్రశ్నించారు. వైద్య సిబ్బంది తప్పని సరిగా సమయపాలన పాటించాలన్నారు. ప్రస్తుతం ఈ విషయం పైఅధికారులకు తెలియజేస్తానని, మరోసారి డాక్టర్లు అందుబాటులో లేరని ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న పెదమాం భరత్

మిర్యాలగూడ టౌన్ : పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పెదమాం భరత్ అన్నారు. ఆదివారం స్థానిక హౌసింగ్‌బోర్డులోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అనంతరం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ సత్తాను చూపించేందుకు కార్యకర్తలు ఇప్పటి నుంచే సైనికుడిలాగా పని చేసి అసెంబ్లీ నియోజకవర్గంలో భారీ మెజార్టీని చూపించేందుకు నియోజకవర్గ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి మేడి నవీన్‌కుమార్, మండల అధ్యక్షులు పానుగోతు కోటేష్, కంచుగట్ల బిక్షపతి, మాలోతు రంగానాయక్, పట్టణ ఉపాధ్యక్షులు మోదాల అశోక్, నాయకులు కిషన్, జగదీష్, వెంకటేష్, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

స్త్రీ శక్తి జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం



లావణ్యను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్

దేవరకొండ : దేవరకొండ పట్టణానికి చెందిన లావణ్య ఇటీవల సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్త్రీ శక్తి జాతీయ అవార్డు అందుకుంది. ఆదివారం పట్టణంలోని స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ లావణ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండకు చెందిన లావణ్యకు జాతీయ స్థాయి అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ వీటీ, పీజే శ్యాంసన్, ఉమామహేశ్వర్, రాపోలు నిరంజన్, భాస్కర్ రెడ్డి, తాళ్ల సురేష్, చేరిపల్లి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పెంచిన ధరలకు కట్టుబడి ఉండాలి'

మిర్యాలగూడ టౌన్ : అవుట్ డోర్ వాల్ పెయింటింగ్ ఆర్టిస్టులు పెంచిన ధరలకు కట్టుబడి ఉండాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా అవుట్ డోర్ వాల్ పెయింటింగ్ ఆర్టిస్టుల అసోసియేషన్ అడ్వయిజర్ దోరెపల్లి వెంకన్న, దాసరి సీతారాములు, దాసరి భిక్షం అన్నారు. ఆదివారం స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఉమ్మడి నల్లగొండ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు జి. సైదులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు ఎం. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి విష్ణు, కోశాధికారి ఖలీలు, సహాయ కార్యదర్శి పి,. యాదగిరి, సాయి కిరణ్, రాజు, భాస్కర్, పి. సైదులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



సర్టిఫికెట్లు పొందిన శిక్షణార్థులతో సంస్థ ప్రతినిధులు

రామగిరి(నల్లగొండ): మహిళలు టైలరింగ్‌లో శిక్షణ తీసుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొంది స్వశక్తితో ఎదగాలని జన శిక్షణ సంస్థాన్, మాతృశ్రీ స్వచ్ఛంద సంస్థల జిల్లా సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో తిప్పర్తి మండలం పజ్జూరు, ఎర్రగడ్డలగూడెం గ్రామాల్లో సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం ఆయా గ్రామాల్లో ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నేటి మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. గొప్పగొప్ప మహిళల విజయ గాథలను స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణ మహిళలు కూడా వివిధ రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయాల్లో కుట్టు శిక్షణ పొందడం ద్వారా తమ పిల్లల దుస్తులను సొంతంగా కుట్టుకుంటూ డబ్బులను ఆదా చేయవచ్చన్నారు. అనంతరం 50 మంది మహిళలు, యువతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పజ్జూరు గ్రామ మహిళలు సంస్థ ప్రతినిధులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పజ్జూరు మాజీ సర్పంచ్ మోయిజ్, సంస్థ టైలరింగ్ టీచర్ గురులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పెద్దవూర : మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన 2011–2012 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 12ఏళ్ల తర్వాత అంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కలిసి తమ అనుభవాలను, క్షేమ సమాచారాలను చర్చించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను పూలమాలతో సత్కరించి శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాటి పాఠశాల హెచ్ఎం సలికంటి వెంకటయ్య, చిట్టిమళ్ల సైదులు, ఉపాధ్యాయులు శంకరాచారి, ఏడుకొండలచారి, చిట్టిమళ్ల శేఖర్, నరేందర్, దామోదర్, వెంకన్న, ఎస్‌కే ఖలీల్‌పాషా, పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్, దత్తునాయక్, వెంకటకృష్ణ, సాయికుమార్, భవాని, కావ్య, సంధ్య, కోటేశ్వరి, అనిత, రంగా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

నల్లగొండ టూటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు సాజీద్ అలీ సంస్మరణ సభ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. సాజీద్ అలీ చిత్రపటానికి జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సాజీద్ అలీ కుటుంబానికి రూ.80 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కే మురళి, దుబ్బ ఆనంద్, ఆర్ నాగేశ్వరరావు ఉన్నారు.